

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తూరు: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం కర్లమ్మగ్రామ పంచాయతీకి చెందిన పతివాడ లక్ష్మీకాంతం, పత్రి ఉమామహేశ్వరరావు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం పంపిణీ చేశారు. ఒకరికి 2.49 లక్షలు, మరొకరికి 1.43 లక్షలు చెక్కలను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మాతల గాంధీ, సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ దాస్ నాయుడు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శులు చోడవరపు రాము, ముగితి కృష్ణారావు, మండల కార్యదర్శి ఎద్దు కృష్ణ ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు మడపాన రాజారావు పాల్గొన్నారు.

పైపులైన్ లీక్...తాగునీరు వృధా

విశాలాంధ్ర-టెక్కలి: మేజర్ పంచాయతీలో డాక్టర్ అంబేద్కర్ జంక్షన్ నుండి రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న మంచినీళ్ల పైపులైను పగిలిపోయి ప్రజలు దాహం తీర్చాల్సిన తాగునీరు నేలపాలై నిత్యం పారుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులకు స్థానికులు మొరపెట్టుకున్నప్పటికీ ఎలాంటి స్పందన లేక నిత్యం నీళ్ల కలుషిత కాలువలలో వృధాగా కలిసిపోతుందని వాపోతున్నారు. త్రాగునీరు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ప్రజా సంక్షేమానికి నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యపు ధోరణి వల్ల పట్టణంలో ఎక్కడికక్కడ నీళ్లు వృధాగా పోతున్నాయని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మంచినీళ్ల పైపులైను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని బిజెపి జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చెత్తను సంపదగా మార్చాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఘనంగా స్వచ్ఛాంధ్ర - 2025 అవార్డుల ప్రధానోత్సవం

విశాలాంధ్ర - శ్రీకాకుళం: పరిశుభ్రతను ప్రజా జీవితంలో భాగం చేయాలని, చెత్తను సంపదగా మార్చే దిశగా ప్రజలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో సోమవారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2025 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ నాటికి జిల్లాలో 95 శాతం ఇంటింటికీ చెత్త సేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా 623 గ్రామాలను ప్రకటించడం, తొమ్మిది మానవ ఘన వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి లక్ష్యాలను వివరించారు. ఈ కృషికి తోడు రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 46 స్వచ్ఛ అవార్డులు శ్రీకాకుళం జిల్లాకు దక్కడం గర్వకారణమని ఆయన అభినందించారు. ఈ స్వచ్ఛ కార్యక్రమాలను మరింత ముందుకు

తీసుకుపోయేందుకు కలెక్టర్ మరిన్ని కీలక చర్యలను ప్రకటించారు. ప్రతి సచివాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, పౌరుల నుంచి సేకరించిన కిలో చెత్తకు రూ.10 చెల్లిస్తామని తెలిపారు. ప్రజలు రోడ్లపై, కాలువల్లో చెత్త వేయకుండా శానిటరీ వర్కర్లకు సహకరించాలని కోరారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక స్వచ్ఛ సేవకుడు తయారు కావాలని కోరారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిపై యుద్ధం చేయాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను సాధించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజాప్రతినిధులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకున్న నేలబొంతు ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికా పాఠశాల, శ్రీ గౌరీశంకర మహిళా సమాఖ్యను వారు ప్రత్యేకంగా అభినందించారు.

అవార్డు పొందిన విభాగాలు ఈ సందర్భంగా ప్రాంగణంలో తమ విజయాలను తెలియజేస్తూ ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేశాయి. అవార్డు సాధించిన వారికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, డీపీఓ భారతి సౌజన్య, సీపీఓ ప్రసన్న లక్ష్మీ, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

విశాలాంధ్ర-సోంపేట: మండలం మామిడిపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన దున్న తులసమ్మ కుటుంబానికి విశాఖ గ్రామీణ బ్యాంకు బీమా పరిహారాన్ని మంజూరు చేసింది. బ్యాంకు మంజూరు చేసిన 20లక్షల రూపాయల ఇన్సురెన్స్ చెక్కును ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ చేతుల మీదుగా సోమవారం తులసమ్మ కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గల కూటమి ప్రభుత్వం ప్రతి విషయంలోను అప్రమత్తంగా ఉంటూ అన్ని అంశాల్లోను అనేక సందర్భాల్లోను ప్రజలకు తోడ్పాటునందిస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో పోటీతత్వంతోనే విజయాలు

విశాలాంధ్ర-కవిటి: క్రీడల్లో పోటీతత్వంతోనే విజయాలు సాధించవచ్చునని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. బైరిపురం గ్రామంలో జరిగిన పుల్లట శంకరమ్మ స్మారక క్రికెట్ పోటీలలో బరంపురం లెవన్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా సోంపేట లైన్స్ జట్టు నిలిచాయి. ఇందులో మూడు రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎమ్మెల్యే అశోక్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక,శారీరక ఆరోగ్యాన్ని ఇస్తాయని ప్రతీ ఒక్కరూ సమయస్ఫూర్తి పాటించాలని అన్నారు. అలాగే బెస్ట్ బౌలర్ జాన్ నిలిచాడు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రైజ్ సంస్థల అధినేత పుల్లట ప్రవీణ్, ఎస్వివి రమణ, పుల్లట శంకర్రావు, పుల్లట రాజు, బల్లెడ లక్ష్మణ మూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కట్యాచార్యులపేటలో ఉపాధి పనులు ఎంపిక

విశాలాంధ్ర-ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాల్లో రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు నిర్వహించేందుకు కట్యాచార్యుల పేట సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి పనులు ఎంపిక చేశారు. గ్రామ పరిధిలోని 4 చెక్ డ్యాములు, నాలుగు చోట్ల సీసీ రహదారులు నిర్మాణం, పాఠశాల, బరియల్ గ్రౌండ్లకు ప్రహరీల నిర్మాణానికి చెరువు రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తుల సూచనల మేరకు తీర్మానాలు చేశారు. ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ 2.0 సవరణ తరువాత తగ్గిన వస్తువుల ధరలతో రైతులకు మేలు జరుగు తోందని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రదర్శించారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సుధా, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హిరమండలం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార, మహేంద్ర తనయ నదులు ఉధృతంగా ఉప్పొంగి వంశధార నదీ పరివాహక గ్రామాలు, పంట

పొలాలు అతలాకుతలం కావడంతో హిరమండలం మండలంలోని, తుంగతంపర, గులుమూరు, జిల్లోదు పేట గ్రామాల్లో పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు పర్యటించారు. అలాగే నష్టపోయిన పంటలకు ప్రభుత్వమే పరిహారం అందిస్తుందని రైతులకు భరోసా కల్పించడం జరిగింది. ఆయనతోపాటు అధికారులు, స్థానిక రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నగరంపల్లి హైస్కూల్‌లో జిఎస్టీ 2.0పై అవగాహన

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూపర్ జిఎస్టీ 2.ఓ (వస్తు సేవల పన్ను)పై సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సూపర్

జిఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశం పైన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం ఇదే అంశంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు ఆధ్వర్యంలో జరగగా, పీఎంసీ చైర్మన్ బి. లక్ష్మీపతి, ఉపాధ్యాయ సిబ్బంది కే.రమణ, టి.ఎర్రన్న, పి.సోమేశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, సీహెచ్.ఉమారావు, వై.కాళిదాసు, ఎం.అప్పలస్వామి, ఆర్.ఇంద్రసేనరావు, ఎన్.గౌరునాయుడు, జి.విశ్వనాథం, సుజాత పాల్గొన్నారు.

ఉయ్యాల పేటలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - నందిగాం: మండలం ఉయ్యాలపేట గ్రామంలో నందిగాం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి చెందిన ఏఎన్ఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులను అందజేశారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం పెట్టాలి

- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాపరెడ్డి

విశాలాంధ్ర - టెక్కలి: విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం నాణ్యతగా తయారుచేసి రుచికరమైన ఆహారాన్ని అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ్ ప్రతాపరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల సమీకృత సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో ఉన్న గదులను, ఆహార నాణ్యతను, పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థినిలకు తయారుచేసిన ఆహార వంటకాలను పరిశీలించి నాణ్యతను తానే స్వయంగా రుచి చేశారు. అనంతరం విద్యార్థులకు రోజువారి మెనూ ప్రకారం సక్రమంగా ఆహారం పెడుతున్నారా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి

ఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరచుకొని వాటి సాధనకు కఠోరంగా శ్రమించాలన్నారు. వసతి గృహంలో క్రమ శిక్షణతో విద్యను నేర్చుకుంటూ తల్లి దండ్రుల కలలను ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం తమకు అందజేస్తున్న ఆహార పదార్థాలను వసతులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్య ప్రకాష్, ఆహార భద్రత అధికారి జి. శ్రీరాములు, తూనికలు కొలతలు సహాయ నియంత్రణ అధికారి పి. చిన్నమ్మి, ఇన్స్పెక్టర్ బల రామకృష్ణ, ఆహార కమిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం అర్జీలు పరిష్కారానికి చర్యలు

- జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 36 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఫిర్యాదుదారులు అర్జీలపై తీసుకున్న చర్యలు నివేదిక రూపంలో నిర్ణీత కాలంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పౌర సంబంధాలు, కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత కేసులు, ఇతర అంశాలపై ప్రజలు తమ వినతిపత్రాలను సమర్పించారు.

విద్యుత్ తీగ తాకి యువకుడు మృతి

విశాలాంధ్ర-మెలియాపుట్టి: ఇంటిపైకి వస్తున్న చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో విద్యుత్ తీగ తాకి ఒకరు విద్యుత్ షాక్‌కి గురి కాగా మరొక యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గంగరాజుపురం గ్రామానికి చెందిన గూడపు చంటి అనే యువకుడు కరెంటు షాక్‌కు గురై సోమవారం మృత్యువాత పడ్డాడు. గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో చెట్టు కొమ్మలు వేలాడుతూ ఉండడంతో గ్రామానికి చెందిన మరో వ్యక్తి మృతుడు గౌడాపు చంటిని పిలిచి ఆ కొమ్మలను తొలగిస్తున్న క్రమంలో ఆ ఇంటికి సంబంధించిన వ్యక్తి కరెంటు షాక్‌కి మొదట గురయ్యారు. తదుపరి వెంటనే, ఆ కొమ్మలను లాగుతూ ఉండగా చంటి కరెంట్ షాక్‌కు గురై కొద్దిసేపట్లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన యువకుడు చంటి గత కొంతకాలంగా విజయవాడలో వెల్డింగ్ తదితర పనులు చేసుకుంటూ ఉండేవాడని, తన తల్లిదండ్రులు కొద్దికాలం క్రితమే మృతి చెందారు.

14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: ఈ నెల 14న జిల్లాలోని దంతపురిలో నిర్వహించతలపెట్టిన బౌద్ధ సమ్మేళనం, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రిటైర్డ్ ఐ.డీ.ఏ.ఎస్. అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కళ్లేపల్లి రామ్‌గోపాల్, అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డా. కంత వేణు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయిడి మురళీక్రిష్ణ, పెయ్యల చంటి, దంతపురి గ్రామానికి చెందిన కొంచాడ సూర్యనారాయణతోపాటు దంతపురి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వినియోగదారులకు మరింత మేలు

విశాలాంధ్ర - కవిటి: జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు మరింత మేలు చేకూరుతుందని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కవిటి మండల కేంద్రంలోని సెలూన్ షాపులు, షాపింగ్ మార్టు, జిమ్ సెంటర్లో జీఎస్టీ తగ్గుదల వల్ల వినియోగదారులకు కలిగిన ఉపయోగాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు జీఎస్టీ తగ్గింపు వివరాలను విధిగా వాణిజ్య కేంద్రాల ముందు ప్రదర్శన చేసి వినియోగదారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ కే.శ్రీనివాస్ రెడ్డి, ఎస్బిఎం కోఆర్డినేటర్ సల్ల జీవన్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10న మెగా జాబ్ మేళా

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గొండు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న శ్రీకాకుళం అభ్యుదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఈ మేళాలో ఏసిఎన్ హెల్త్ కేర్,

కాన్సెంట్రిక్స్, ఆరబిందో, కియా మోటార్స్, హెట్రో, స్నైడర్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర 18 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని వెయ్యికి పైగా ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నాయని వివరించారు. ఎస్ఎస్‌సీ నుండి డిగ్రీ వరకు చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా (నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్)లో రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ప్రతులు, ఫోటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్‌ను 9704960160, 6301045132 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

క్విజ్ పోటీల్లో కొత్తపల్లి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మందస: దసరా నవరాత్రులు సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన క్విజ్, ప్రతిభా పరీక్షల్లో మందస మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు తెలిపారు. పలాస మండలం రంగోయి గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి గ్రూప్ టాలెంట్ టెస్ట్‌లో 4వ స్థానంలో నిలిచి షీల్డ్, రూ.500 నగదు, సోంపేట మండలం ఇసుకలపాలెంలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి షీల్డ్, రూ.4001 నగదు పురస్కారాన్ని అందుకున్నారు. విజేతలలో పి.కీర్తన, జీవన్ సింగ్ ఠాకూర్, గౌతమ్ సింగ్ ఠాకూర్, యన్.భార్గవి, కె.జ్ఞానేశ్వరి, కె.శ్రీజ, బి.సుస్మిత అనే విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యస్.గణేశ్వర రావు, జి.భీమారావు, జి.జానకమ్మ, యమ్.లక్ష్మణరావు, ఏ.అప్పారావు, బి.పాపమ్మ, యమ్.చిత్రసేను, యమ్.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, యస్.హారిక తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: భూముల పూర్తి వివరాలతో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని టెక్కలి ఆర్డిఓ ఎం.కృష్ణమూర్తి పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతపురం గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎన్ని మన్మథరావు అధ్యక్షతన ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఇప్పటివరకు సర్వే నెంబర్లు, ఖాతా నెంబర్లు సరిగ్గా లేని రైతులు అధికారులు వచ్చినప్పుడు దగ్గర ఉండి వివరాలు తెలియజేయాలని ఆయన అన్నారు. తహసీల్దార్ హేమాసుందర్, సర్వేయర్లు వీఆర్వోలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

మహా అన్నసంతర్పణ

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆముదాలవలస పట్టణం రైల్వే స్టేషన్ ఆవరణలో మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో 3,500 మంది భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా తపన కార్యక్రమాన్ని దేవి కమిటీ సభ్యులు నిర్వహించారు. క్రమం తప్పకుండా 59 ఏళ్లుగా దుర్గ దేవి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాన్ని దుర్గాదేవి కమిటీ సభ్యులు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది.

ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకూడదు

- ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం

విశాలాంధ్ర-కవిటి: యూరియా ఇతర ఎరువుల కోసం రైతులు ఎవరు ఇబ్బందులు పడకూడదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం రామయ్య పుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని ఏవోలు, ఏడీఏతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలం వారీగా విస్తీర్ణం, అవసరమైన యూరియా, ఇప్పటి వరకు అందించిన యూరియా, అవసరమైన యూరియాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఏ భవానీ శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంకు ఈ ఖరీఫ్‌లో 2400 టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 1800 టన్నులు రైతులకు అందజేయడం జరిగిందని, ఇంకను 600 టన్నులు అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించారు. ఈ-పంట నమోదుపై సమీక్షించగా ఇప్పటి వరకు 55 శాతం మాత్రమే కావడంతో ఈ నెల 25 తేదీ వరకు సమయం ఉందని ఈలోగా సిబ్బందిని సర్దుబాటు చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి వ్యవసాయాధికారులు పిరియా శ్రీదేవి, బొర్ర నరసింహమూర్తి, అజయ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం-ఆహార భద్రతే భవిష్యత్‌కి పునాది

విశాలాంధ్ర - సోంపేట: విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం సోంపేట, బారువ, కంచిలి, మందస మండలాల్లోని పాఠశా లలు, అంగన్వాడి కేంద్రాలు, వసతి గృహాల్లో ఆయన బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటకాలను రుచి చూసి, మెనూ అమలు సక్రమంగా జరుగు తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని తెలిపారు. గంజి వడబోయకుండా వండాలని, ఆహార నాణ్యతలో రాజీ పడకూడదని సూచించారు. పాఠశాలల్లో సరుకుల నిల్వలు, వంట సామగ్రి, బిల్లుల చెల్లింపుల రికార్డు లను పరిశీలించారు. తదుపరి కంచిలి మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్, బఫర్ గోదాంలను తనిఖీ చేసి సరుకుల నిల్వలను పరిశీలించారు. ఈ పర్యటనలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదనరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు, స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విమల, పౌర సరఫరాల అధికారి గుంట సూర్యప్రకాశ్, ఆహార భద్రత అధికారి జి. శ్రీరాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు హరిచంద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల టెక్కలి మైదానంలోనూ, శ్రీకాకుళం శ్రీ చైతన్య స్కూల్ లోను, శ్రీకాకుళం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే నెట్ బాల్ ఎంపికలో వివిధ ఏజ్ కేటగిరీలో హరిచంద్రపురం తజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కి చెందిన విద్యార్థులు కరాటే విభాగం లో కె. శ్యామ్ కుమార్ (అండర్ 14), నెట్ బాల్ విభాగంలో అండర్ 19 కేటగిరీలో ఎస్.లక్ష్మణ, కె.పార్థసారథి. అండర్ 17 కేటగిరిలో జి.షణ్ముఖ, ఎం.హరి కృష్ణ. అండర్ 14 కేటగిరీలో వి. జగదీష్, కె. రమణ, ఎం.యోగేశ్వరరావులు శ్రీకాకుళం జిల్లా జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూక లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మరియు వ్యాయామ ఉపాధ్యాయులు దేవాది నాగరాజు ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యునిగా డి.మహరణ

విశాలాంధ్ర-పలాస: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ.జే.యూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పలాసకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, విశాలాంధ్ర విలేఖరి డి.మహారణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 4,5 తేదీలలో జైపూర్(రాజస్థాన్)లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాలలో ఐజేయు అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, పూర్వాధ్యక్షుడు ఎస్.ఎన్.సిన్హా, ఐ జే యు నూతన సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావులతో పాటు దేశం నలుమూలల నుండి 17 రాష్ట్రాలకు చెందిన జాతీయ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆహ్వానితులు పాల్గొన్నారు. ఐజేయు 2025-27ఎన్నికలకు చీఫ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన మహేష్ కుమార్ సిన్హా ఎన్నికల ఫలితాలు తెలిపారు. నూతన అధ్యక్షులు బల్వందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ గా డి.సోమసుందర్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేశ వ్యాప్తంగా 150 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుండి ఇప్పటికే జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్న నల్లి ధర్మారావుతోపాటు సీనియర్ జర్నలిస్ట్ డి.మహరణ కూడా జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహారణ మాట్లాడుతూ గతంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా వ్యవహరించానని తనను ప్రోత్సహించి సముచిత స్థానాన్ని కల్పించేందుకు కృషి చేసిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావుకు, జిల్లా జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జిఎస్‌టి ఆదాపై అవగాహన

విశాలాంధ్ర-సోంపేట: కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి 2.0 పేరిట చేపట్టిన నూతన సంస్కరణలపై సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.మోహనరావు, జి.వెంకటరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు రామినాయుడు, ప్రసాద్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిఎస్‌టితో సూపర్ సేవింగ్స్ పేరిట ఏ వస్తువుకు ఎంత శాతం తగ్గుదల అనే అంశంపై వివరిస్తూ ర్యాలీ చేపట్టారు.

అధికారుల పనితీరు భేష్

- అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు అధికారులంతా అప్రమత్తంగా ఉండటంతో ఎలాంటి నష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన జిల్లా జాయింట్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని చెబుతూ అధికారులను ఆయన అభినందించారు. ప్లాస్టిక్ సింగిల్ యూజ్ ఫ్రీ అని ప్రకటించారు. అధికారులు అందరూ ఒక స్టీల్ వాటర్ బాటిల్ తీసుకొని రావాలన్నారు. తుఫానుల గూర్చి ముందుగానే సమాచారం ఉంటుందని మూడు రోజులు ముందుగానే సమాచారం తెలియజేస్తే అందరూ జాగ్రత్త పడేందుకు అవకాశం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిని ఆదేశించారు.

జీఎస్టీ 2.0 పై ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న జీఎస్టీ ఎగ్జిబిషన్ లో అధికారులతో పాటు వ్యాపారస్తులు హాజరు కావాలన్నారు. వ్యవసాయ పని ముట్లు, మెడికల్ ఇన్సూరెన్సు, నోట్ బుక్స్, తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయా శాఖల అధికారులు షెడ్యూల్ ప్రకారం ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. గ్రామ, సచివాలయాల సిబ్బంది ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు పై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. త అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నీటి సరఫరా బంద్

విశాలాంధ్ర-మందస: మండల కేంద్రం మందసలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలకు నీరు అందించే రక్షిత మంచినీటి పథకం పైపు లైన్లు తోపాటు నీటి పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో గత ఆరు నెలలకు పైగా ప్రభుత్వ కార్యాలయాలకు నీరు సరఫరా పూర్తిగా బంద్ అయింది. ప్రభుత్వ కార్యాలయాలకు నీరు సరఫరా బంద్ కావడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలకు నీరు సరఫరా చేసేందుకు మండల పరిషత్ కార్యాలయం ప్రాంతంలో ప్రత్యేక రక్షిత మంచి నీటి పథకాన్ని ప్రభుత్వం నిర్మించిన సంగతి తెలిసిందే. నీరు సరఫరా పూర్తిగా లేకపోవడంతో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు దిగువ స్థాయి సిబ్బంది నానా కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం.. వెలుగు కార్యాలయం..ఉపాధి హామీ పథకం కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్యాలయంలో నీరు అందుబాటులో లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఐ సి డి ఎస్ కార్యాలయంలోనూ వెలుగు ఉపాధి కార్యాలయాల్లో తరచూ సమావేశాలు అధికారులు నిర్వహిస్తుంటారు. ఈ కార్యాలయంలో తాగునీరు సౌకర్యం లేకపోవడం మరుగుదొడ్లు బాత్రూములకు నీరు సరఫరా లేకపోవడంతో అంగన్వాడీ కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నీరు సౌకర్యం పూర్తిగా లేకపోవడంతో మరుగుదొడ్లు,బాత్రూం గదులకు పూర్తిగా తాళాలు వేశారు. ఇవన్నీ వినియోగం లేక నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ కార్యాలయాలకు నీరు సరఫరా చేసేందుకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వసతి గృహాల్లో ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వండి పెట్టాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కార్పోరేషన్ చైర్మన్ చిత విజయప్రతాప్రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రాత్రి స్థానిక ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఏరోజు ఏఏ ఆహారం పెడుతున్నారు, వారానికి ఎన్ని కోడి గుడ్డు అందిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుక ఎన్నారు. అలాగే విద్యార్థులకోసం రాత్రికి తయారు చేసిన భోజనాన్ని తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సంఘీక సంక్షేమ సహాయ అధికారి గురువెళ్ళి వెంకట విజయలక్ష్మి, ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారి కొన్న సీతారాం తదితరులు ఉన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను అభినందించిన చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

విశాలాంధ్ర-సోంపేట: మండలం బారువలో సోమవారం పర్యటించిన రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించి అక్కడ చాలా సమయం గడిపారు. హాస్టల్ రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో వంటా వార్పులను గమనించారు. విద్యార్థులతో అన్ని విషయాలు కులంకుషంగా మాట్లాడారు. హాస్టల్ సంక్షేమాధికారి రవికుమార్ తీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను దుశ్శాలువ కప్పి సత్కరించారు.

పాఠశాల ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ సమావేశం

విశాలాంధ్ర- సోంపేట/కంచిలి: కంచిలిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎస్‌ఎస్ సమావేశాన్ని నిర్వహించడం పట్ల సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి సోమవారం తహశీల్దార్ రమేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లో ఎటువంటి సంఘాల సమావేశాలు నిర్వహించవద్దని విద్యాశాఖామంత్రి నారా లోకేష్ స్వయంగా ప్రకటించినప్పటికి ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి పాఠశాల ఉపాధ్యాయుల మద్దతుతో సమావేశం నిర్వహించడం చట్ట విరుద్ధమని దీనిపై తగ చర్యలు తీసుకోవాలని కోరారు.

10వ తరగతి విద్యార్థి అదృశ్యం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం, జగన్నాధపురం గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అద్ల చందు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు తల్లి అద్ల పుష్ప సోమవారం సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. 2 రోజుల క్రితం బోడిగుండు చేయించుకున్నాడు. తెల్లని ప్యాంటు, ఆకుపచ్చ రంగు టీ షర్ట్ వేసుకున్నాడని, 5 అడుగులు ఎత్తు ఉండి, సామన చాయగా ఉంటారని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై వై. సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 6309990863 నెంబర్ కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మద్యంపై అధిక ధరల విక్రయాలను అరికట్టండి

ఎక్సైజ్ అధికారులకు సామాజికవేత్త మాన్యాల వినతి

విశాలాంధ్ర-పలాస: జిల్లాలో ఏ ప్రాంతంలో లేని విధంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మద్యం వ్యాపారస్తులు సిండికేట్ గా ఏర్పడి ఎం ఆర్ పి పైన అధిక ధరలు వేసి పేద ప్రజల రక్తాన్ని పిండేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని తూట్లు పొడుస్తున్నారని సామాజిక వేత్త మాన్యాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్,కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం వ్యాపారస్తుల పైన యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని ఎంఆర్ పి ధరలకే మద్యం అమ్మకాలు జరిగే విధంగా చూడాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించవలసిందిగా ఎక్సైజ్ అధికారులకు ఆయన కోరారు. దీనిపై స్పందిస్తూ నేటి నుంచి పలాసకాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్ ఆర్ పి ధరలకే మద్యం అమ్మే విధంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సి ఐ హామీ ఇచ్చారని, ఏ మద్యం దుకాణాల నిర్వాహకులు ఎం ఆర్ పి ధరలకు అధికంగా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించవలసిందిగా కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా యమ్.ఆర్.వి.పై అధికంగా రేట్లు పెంచి అమ్మకాలు చేస్తున్నారని, సామాన్య ప్రజలు ప్రశ్నిస్తే నీ దిక్కున వాడికి చెప్పుకో అని వైన్ షాపుల సిబ్బంది నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను కూడా పక్కన పెట్టి మద్యం వ్యాపారస్తుల సిండికేట్ పై చర్యలు తీసుకోవలసిందిగా, అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన హామీని నిలబెట్టవలసినదిగా కోరారు. అదే విధముగా వివిధ గ్రామాలలో అనేక బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అక్కడ కూడాను మద్యం సిండికేట్ వ్యాపారులు అత్యధిక ధరలతో ప్రజలను బెంబేలిస్తున్నారని..అసలు పలాస-కాశీబుగ్గలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారా..?లేరా..? అనే విధంగా మద్యం సిండికేట్ వ్యాపారస్తులు చేస్తున్న ఆగడాలను యుద్ధప్రాతిపదికన ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు స్పందిస్తూ నేటి నుంచి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్ ఆర్ పి ధరలకే అమ్మకాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ హామీ ఇచ్చారని, మద్యం దుకాణాల నిర్వాహకులు ఎం.ఆర్.పి ధరలకు అధికంగా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర పద్మనాభం: పద్మనాభ మండలం కృష్ణాపురం పంచాయతీలో ఎంపీడీవో కే రూపేష్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ సహకరించాలనికోరారు. గ్రామంలో ఉన్న పొలాలకు వెళ్లాలంటే రైతులందరూ కూడా వెళ్లే మార్గాన పైడితల్లి అమ్మవారి గుడి దగ్గర నుండి మూడు తోవల వరకు స్థానికంగా ఉన్న గృహాల నుండి వస్తున్న మురుకు నీరు రోడ్డుపైకి వస్తుందని, ఆ మురుకు నీరుని దాటుకుంటూ రోజుకు సుమారు 500 మంది రైతులు పొలాలకు వెళుతున్నారని, ఆ మురుకు నీరు గుండా వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామసభకు హాజరైన రైతులు, స్థానికంగా ఉన్న ప్రజలు ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లారు. స్థానికంగా ఉన్న గృహాల నుండి మురుగునీరు వెళ్లేందుకు అనుకూలంగా కాలువలు నిర్మించాలని ఎంపీడీవోను స్థానికంగా ఉన్న ప్రజలు కోరారు. తక్షణమే స్పందించిన ఎంపీడీవో రైతులు ఇబ్బంది పడుతున్నామని చెప్పిన ఆ మార్గాన్ని పరిశీలించారు. ఎంపీడీవో రైతులతో మాట్లాడుతూ మురుకు నీరు వెళ్లేందుకు కాలువ నిర్మించాలంటే, చాలా దూరం నిర్మించాల్సి వస్తుందని కావున రైతులు, ప్రజలందరూ సహకరిస్తే చాలా పెద్ద ఇంకుడు గొయ్యిని నిర్మిస్తామని తెలిపారు. కాలువ నిర్మాణానికి స్థానికంగా ఉన్న ప్రజలు కొంతమంది ఆమోదం తెలుపుతున్నారని, మరి కొంతమంది ఆమోదించటం లేదని కావున ప్రజలందరూ అర్థం చేసుకొని ఇంకుడు గొయ్యి నిర్మాణానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా సూపర్ జీఎస్టి-సూపర్ సేవింగ్ గురించి ప్రజలందరిలో కూడా అవగాహన కల్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో ప్రభుత్వ కాలనీలో పట్టాలు పొందిన ప్రతి ఒక్కరు కూడా నిర్మాణాలు చేపట్టాలని, లేని పక్షంలో ఆ పట్టాలు రద్దుచేసి మరొక లబ్ధిదారునికి ఇవ్వటం జరుగుతుందని ప్రజలకు తెలియజేశారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిలు అందించే కార్యక్రమంలో భాగంగా గ్రామం మొదలు నుంచి చివరి వరకు సిసి రోడ్డు మొత్తం త్రవ్వేసి మరలా అలానే వదిలేసారని ప్రజలు ఎంపీడీవో దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎంపీడీవో స్పందిస్తూ నిధులు సరిపోకపోవడం వలన, పనులు మధ్యంతరంగా ఆగి ఉన్నాయని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లి, త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ హరీష్‌ని వివరణ కోరగా ఇంటింటికి కుళాయిలు అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం వారు జలజీవన్ మిషన్ పథకం ద్వారా కృష్ణాపురం పంచాయతీకి 6 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇలా కేటాయించిన 6 లక్షల రూపాయలు నిధులు కేవలం సిసి రోడ్డును త్రవ్వడం కోసం, కుళాయిలు వేయటం కోసం మాత్రమే సరిపోయాయని తెలిపారు. పగలగొట్టిన సిసి రోడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయించమని పై స్థాయి అధికారులకు కోరడం జరిగిందని అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 81 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 81 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన అదనపు కమిషనరు ఎస్.ఎస్.వర్మతో కలసి జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి అదనపు కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 81 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్‌కు 09, 3వ జోన్‌కు 14, 4వ జోన్‌కు 10, 5వ జోన్‌కు 13, 6వ జోనుకు 12, 7వ జోనుకు 01, 8వ జోన్‌కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 06, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 46, ఇంజినీరింగు విభాగమునకు 12, మొక్కల విభాగమునకు 02, యుసిడి విభాగమునకు 06 కలిపి మొత్తంగా 81 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఎ.ప్రభాకర రావు, డి సి ఆర్ శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు కె.శ్రీనివాసరావు సంపత్ కుమార్ ,గోవిందరావు, డిడిహెచ్ ఎం.దామోదర రావు, డీసీపీలు-హరిదాసు, కె. వెంకటేశ్వరరావు రామ్మోహన్, మధుసూదనరావు, యుసిడి - పి ఓ పి.ప్రసన్నవాణి,డిపిఓ శాంతి కుమారి, ఏసీపీ లు, ఆర్ ఎఫ్ ఓ సిహెచ్ .కృపానంద్, సివిఓ డా.ఎల్.రవికుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, టి.పి.ఆర్.ఓ రజినికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకోవాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఉచిత దంత వైద్య శిబిరాన్ని రోగుల సద్వినియోగపరచుకోవాలని మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు అన్నారు సోమవారం మండలంలోనిగొట్టిపల్లి శ్రీ సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో సంగివలస నీరుకొండ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు గొట్టిపల్లి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలకు ఎటువంటి చిన్న సమస్య వచ్చిన వెంటనే వైద్యుడుని సంప్రదించి పరీక్ష చేసుకోవాలన్నారు. ఎటువంటి అశ్రద్ధ చేయకూడదని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నారై డెంటల్ సైన్సెస్ వైద్యులు మోటూరి ఐశ్వర్య, అంబటి షీలా 60మంది రోగులకు పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే సమస్య పెద్దదిగా ఉన్నవారికి ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, సేవాదళ్ కోఆర్డినేటర్ డి కార్తీక్, మహిళా సేవాదళ్ సంధ్య, మహిళా కోఆర్డినేటర్ కే రోహిణి తదితరులు పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

విశాలాంధ్ర - పెందుర్తి : గాజా పై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీవుల్లా డిమాండ్ చేశారు. పాలస్తీనా జాతి హననానికి వ్యతిరేకంగా, గాజా ప్రజల జాతి విముక్తి పోరాటానికి మద్దతుగా సోమవారం విశాఖపట్నం సింక గ్రాండ్ లో, పౌర ప్రజా సంఘాల వేదికగా రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి మాట్లాడుతూ గత కొంతకాలంగా ఇజ్రాయిల్ గాజ ప్రాంతంపై చేస్తున్న దాడుల్లో వేలాదిమంది అసువులు బాసారని ఈ మారను కాండను ఇప్పటికైనా నిలుపు చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ వినాశనానికి పాల్పడుతోందని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

విశాలాంధ్ర పేజీ : 2
శ్రీకాకుళం
మంగళవారం 7, అక్టోబర్, 2025

కేజీబీవీలో ఘనంగా మానసిక ఆరోగ్య వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - హిరమండలం : ఈ నెల 10వ తేదీన మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వారం రోజులు మానసిక ఆరోగ్య వారోత్సవాలు ఘనంగా హిరమండలం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ సంపతిరావు కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగునున్నాయని ఈ సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ కృష్ణ వేణి కేజీబీవీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల యొక్క ఆహారపు అలవాట్లు వారి యొక్క మానసిక ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో తెలిపారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు ఎలా పెంపొందించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఏ ప్రశాంత్ కుమార్ జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థులకు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు మరియు పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అఖిల భారతీయ యాదవ మహాసభ

విశాలాంధ్ర - కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన యాదవ సామాజిక వర్గ ముఖ్య నాయకులు రాజస్థాన్లో జరుగుతున్న అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ సమావేశాలకు హాజరయ్యారు. ఈనెల 5వ తేదీ నుండి జరిగే ఈ కార్యక్రమం రాజస్థాన్ రాష్ట్రంలోని, శికార్ జిల్లా, రింగాస్ లోని ఖాటూశ్యాం యాదవ ధర్మశాల ప్రాంగణంలో ఘనంగా ఈ సమావేశాలు నిర్వహించారు. రాజస్థాన్ యాదవ సంఘం నిర్వహణలో,జాతీయ అధ్యక్షులు మహేష్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశానికి దేశంలోని 19 రాష్ట్రాల అధ్యక్షులు,జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరై జాతి సమస్యలపై ప్రస్తావించారు.ఈ సమా వేశంలో దేశంలో యాదవులు ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై చర్చించారు. దేశంలో యాదవులు అధిక సంఖ్యాకులైనప్పటికీ రాజకీయ ప్రాధాన్యతలో వెనుకకు నెట్టివేయ బడ్డారనీ ముఖ్యమైన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో యాదవుల సంఖ్యతో పాలనాధికారాలు చేపడుతున్న రాజకీయ పార్టీలు యాదవుల సంఖ్యకు సమానమైన సంఖ్యలో పదవులు ఇవ్వడంలో అన్ని పాలక పార్టీలు వివక్ష చూపుతున్నాయని అన్నారు.తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన పదాధికారులు లాకా వెంగళరావు యాదవ్, నర్తు నరేంద్ర యాదవ్, ఎ.వి.ఆర్ రాజు యాదవ్, ఓరుగంటి వెంకట్ యాదవ్,కతారి రామ్మోహన్ యాదవ్,ఆవుల నర్సింహారావు యాదవ్, కొర్రాయి వాసుదేవ్ యాదవ్,పవన్ యాదవ్లకు రాజస్థానీ తలపాగాలు, వాణీలతో సత్కరించి పూల మాలలను అలంకరించారు. అనంతరం యాదవ ధర్మశాల సమావేశ మందిరంలో జరిగిన అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ పదాధికారుల సమావేశంలో జాతీయ అధ్యక్షుని ఎంపిక ప్రక్రియ సంఘ బైలాలని అనుసరించి ప్రజాస్వామ్య పద్ధతిన నిర్వహించారు. అఖిల భారతీయ యాదవ మహాసభ, ఉత్తర ప్రదేశ్ కి చెందిన జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్ యాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జాతీయ అధ్యక్షునిగా మహేష్ యాదవ్ పేరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన లాకా వెంగళరావు యాదవ్ ప్రతిపాదించగా రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్ యాదవ్, ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ దేవేంద్ర యాదవ్,ఆంధ్రప్రదేశ్ కి చెందిన నర్తు నరేంద్ర యాదవ్ లు బలపరిచారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ పదాధికారులు మహేష్ యాదవ్ గత పాలనా కాలంలో చేసిన కృషిని సేవలను శ్లాఘించారు. దేశంలో 22 రాష్ట్రాలలో సంఘ కార్యవర్గాలను నియామకం చేసిన ఘనత మహేష్ యాదవ్ దని, రెండవ సారి జాతీయ అధ్యక్షుడుగా ఎంపికకు అర్హుడని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుంచి లాకా వెంగళరావు యాదవ్, నర్తు నరేంద్ర యాదవ్, ఎ.వి.ఆర్ రాజు యాదవ్, ఆవుల నర్సింహారావు యాదవ్, కొర్రాయి వాసుదేవ్ యాదవ్, కతారి రామ్మోహన్ రావు యాదవ్, డా. పవన్ యాదవ్ లు శాలువాలతో, పూల మాలలతో మహేష్ యాదవ్ ను సత్కరించి అభినందించారు.

భిలాయిలో సింహాద్రి అప్పన్న మందిర నిర్మాణానికి సన్నాహాలు

విశాలాంధ్ర - పలాస : చత్తీస్ ఘడ్ భిలాయి లో సింహాద్రి అప్పన్న మందిర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు వాడబలిజ జాతీయ సంఘం సభ్యులు నిర్ణయించారు. సోమవారం భిలాయి కుర్సీపార్ శ్రీరామ చౌక్ లో ఉన్న సంఘ భవనంలో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు డా. లండ జగన్నాథ్ రావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సంఘం పేరిట అధికార వెబ్ సైట్ ప్రారంభించాలని,ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో గాని, డిసెంబర్ తొలి వారంలో గాని వార్షిక పరివార సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించారు.అలాగే సంఘం ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత జీవిత సభ్యులు మరణానంతరం ప్రతి ఒక్కరికి ఐదు వేల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం చేయడానికి, ప్రస్తుతం నిరుపేద కుటుంబాలకు ఐదు వేల రూపాయలు సహాయం అందించడానికి అధ్యక్షుడు ప్రకటించారు.కోశాధికారి వాసుపల్లి యోగి రత్నం సంఘ ఆదాయ వ్యయాలను సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి కొండప్ప కొర్మారావు, ఉపాధ్యక్షుడు తోట లోకనాథం, ఉపాధ్యక్షులు మైలపల్లి కామాక్షమ్మ, ఉప ప్రధాన కార్యదర్శి కోడ కూర్మారావు, కార్యవర్గ సభ్యులు గుంటి ధనరాజు,దౌలపల్లి శ్రీనివాస్,మైలపల్లి లోకేష్ కుమార్,కొవిరి ముకేష్ కుమార్, మద్దు దాలయ్య,వి వెంకట్, వంక గిరిబాబు,బర్రి జోగారావు,మొరిపల్లి బాబూరావు, కర్రి ఉమాశంకర్ రావు,లండ కాళిదాసు,మద్దు పాపారావు,గండుపల్లి మాధవ్ రావు,గనగళ్ళ హరికృష్ణ, కంబాల పాపారావు, వాసు పల్లి వైకుంఠ రావు,కొవిరి రాజు, చిడుపల్లి దుర్యోధన రావు,చీగటి గణపతి రావు,మొరిపల్లి ధర్మారావు, వడ్డీ సూర్య నారాయణ,బర్రి ఈశ్వర రావు, మైలపల్లి ఈశ్వర రావు, వంక అప్పల స్వామి,

నేతాడ ప్రభాకర్, ఇద్ది తులసీ రావు,దొంక షణ్ముఖ రావు, పొట్టి జోగేశ్వరి, బి ఇందూ రావు, ఎల్ లక్ష్మి, పర్సుపల్లి వెంకట రావు, పరుశురాం, బైపల్లి అప్పారావు,కె శ్రీనివాస్ రావు,డి నాగమణి, బి పద్మా వతి, యేసయ్య, ఎస్ పురుషోత్తం, గణపతి, వెంకట రావు,జగమయ్య రావు, ఎన్ సుధాకర్ రావు,ఇద్ది గౌతం కుమార్,కె అప్పల స్వామి,ఎం తిరుపతి రావు,ఇద్ది హేమంత రావు, కె శేఖర్, బి రామారావు, త్రినాథరావు,కె నీలాద్రి, ఎం ఎస్ రావు,ముత్తి కృష్ణ, ఎస్ రాజ శేఖర్ రావు, కె శ్రీనివాస్ రావు ,కొండప్ప సవరయ్య, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నాయకులు కోరుతూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్కి వినతిపత్రాన్ని అందజేసారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను వైద్య విద్యకి దూరం చేసే విధానాలు ప్రభుత్వం విడనాడాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నాయకులు అంతా కలసి గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేసారు. రాష్ట్రంలో ఉండే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటికించాలని సర్కారు తీసుకున్న నిర్ణయం దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు వైద్య విద్యకి దూరం అయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదనను వ్యక్తం చేసారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించాలని అంతా కోరుకుంటున్నారని తెలియజేసారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం వైద్య విద్యను అందజేసే మెడికల్ కళాశాలలు ప్రైవేటికరించేందుకు సిద్ధపడటం దారుణమని పేర్కొన్నారు. తమ ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని వారంతా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కి విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేసిన తర్వాత దళిత-ఆదివాసి- బహుజన- మైనార్టీ సంఘాల నాయకులు మాట్లాడుతూ అందరూ చదువుకో వాలన్నదే అంబేద్కర్ ఆశయాలకి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే తూట్లు పొడిచినట్లవుతుందని ఆవేదనను వ్యక్తం చేసారు. రాష్ట్రంలో అణగారిన,బహుజన,మైనార్టీ వర్గాలను వైద్య విద్యకి దూరం చేసే కుట్రలు తమను ఆందోళనకి గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకి కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడటం దుర్మార్గమని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం సర్కారుకి తగదన్నారు. లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వాలు మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం అవసరమైన నిధులు ఖర్చు చేయలేరా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు దళితులు - ఆదివాసీలు - బహుజనులు- మైనార్టీలు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి నాయకులు తైక్వాండో శ్రీను,డా కంత వేణు, ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎస్.వి.రమణ మాదిగ, మహిబుల్లా ఖాన్, అమిరుల్లా బేగ్, రౌతు శంకర్ రావు, బాడాన దేవభూషణరావు, గుండబాల మోహన్, ఎం.ఏ బేగ్, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, వైశ్యరాజు మోహన్, గద్దెబోయిన కృష్ణారావు, నీలాపు ముకుందరావు, నల్లబారిక శ్రీను, పెయ్యల చంటి, అబ్బాస్, సింకు రమణ, అరిబారిక రాజు, నేతల అప్పారావు, కొత్తూరు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బరాటం శ్రీనివాసరావు

విశాలాంధ్ర - టెక్కలి : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఏపీపిఎస్ఏ) ఐకాన్ అకాడమిక్ అచీవ్మెంట్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో టెక్కలికి చెందిన అమ్మ ఒడి స్కూల్ చైర్మన్ అండ్ ఏపీపిఎస్ఏ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బరాటం శ్రీనివాసరావు కు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ఏపీపిఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎం జనార్ధన రావు, స్టేట్ కౌన్సిల్ అధ్యక్షులు కే చంద్రశేఖర్ రావు మరియు సభ్యులు చేతులు మీదగా అవార్డును ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య పట్ల ఉన్న ఆసక్తి మాకు ప్రతిరోజు ప్రేరణని ఇస్తుందని, మీ కృషి నిబద్ధత అనేకమంది విద్యార్థుల జీవితాలను మలుస్తూ ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ఎం రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జోన్ అధ్యక్షుడు ఏ గణపతి తదితరులు ఉన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు మరియు పలువురు అభినందనలు తెలియజేశారు.

హెచ్సిఎల్ సంస్థకు ఐతం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - టెక్కలి : సమీపంలోని ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల హెచ్సీఎల్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వీరికి 4.25 లక్షలు ప్రథమ వార్షిక వేతన ప్యాకేజీతో పాన్ ఇండియా స్థాయిలో ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక పోటీల మధ్య ఐతమ్ విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్. శ్రీనివాసరావు, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వై. రమేష్, డీన్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎం. సంతోష్కుమార్, మరియు అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అక్టోబర్ 14న దంతపురిలో బౌద్ధ సమ్మేళనం

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : శ్రీకాకుళం జిల్లాలో క్రీస్తు శకం రెండవ శతాబ్దం నుంచి బౌద్ధ ఉనికి ఉందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. దంతపురి కోట, సాలిహుండం అలాగే సంఘమేశ్వర స్వామి ఆలయం, జగద్గిరిగుట్ట మొదలగు ప్రదేశాల్లో దొరికిన అవశేషాలలో పరిశీలించిన పురావస్తు శాఖ.. ఇక్కడ క్రీస్తు శకం రెండవ శతాబ్దం నుంచి బౌద్ధం మతం అనేది ఉనికిలో ఉందని గుర్తించారు. అయితే జిల్లాలోని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలలో ఒక్కటైన సరుబుజ్జిలి మండలంలోని దంతపురిలో ఈ నెల 14న బౌద్ధ సమ్మేళనం నిర్వహిస్తున్నారని. బాబా సాహెబ్ అంబేద్కర్ బౌద్ధం స్వీకరించిన రోజుని పురస్కరించుకుని ఆ రోజున దమ్మ దీక్షా దినోత్సవాన్ని జరుపనున్నామని, బౌద్ధ సమ్మేళనంతో పాటు దంతపురి వద్ద గల పాలవలసలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కూడా అదే రోజు ఆవిష్కరించేందుకు శ్రీకాకుళం జిల్లా దళిత జె.ఏ.సి. నాయకులు కళ్లేపల్లి రామ్ గోపాల్, తైక్వాండో శ్రీను, డా. కంత వేణు, బడే కామరాజు, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్, సూర్యనారాయణ, బి మురళీ కృష్ణలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రపంచానికి మొట్టమొదటిసారిగా శాంతి, ధర్మం, అహింసా మార్గాలను బోధించిన మహానుభావుడు బుద్ధుడు. అటువంటి బుద్ధడికి సంబందించిన దంతపురి క్షేత్రంలో బౌద్ధ సమ్మేళనం నిర్వహిస్తుండగా ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి బౌద్ధ ఉపాసకులులతో పాటు బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధ బిక్షువులు, మేథావులు, దళిత ఉద్యమనేతలు, అంబేద్కర్ వాదులు తరలిరానున్నారని. రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా విచ్చేయనున్నారని. బౌద్ధ సమ్మేళనంలో బౌద్ధ దమ్మ దీక్ష దినోత్సవ విశిష్టతను, మానవ వ్యక్తిత్వ వికాసానికి బుద్ధుని బోధనలు ఏ రకంగా ఆచరణీయమో అన్న విషయాలు తెలియజేయనున్నారు. ఈ కార్యక్రమాలలో పెద్ద ఎత్తున బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, మేథావులు, అంబేద్కర్ వాదులు అంతా కూడా హాజరుకావాలని రిటైర్డ్ ఐ.డీ.ఏ.ఎస్. అధికారి పి.ఎస్.ఎన్. మూర్తి పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మానానికి రూ.20 వేలు సహాయం

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం గురండి పంచాయతీ పరిధిలోని కాశీపురం గ్రామంలో గ్రామస్థులంతా కలిసి నిర్మిస్తున్న శ్రీ సీతారామ స్వామి ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహాయంగా గురండి గ్రామ సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు 20 వేల రూపాయలను అందజేశారు కాశీపురం లోని రామమందిర నిర్మాణ కమిటీకి అందజేశారు.సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు చేసిన సహాయానికి కాశీపురం గ్రామస్థులందరూ అభినందనలు తెలియజేసారు.

ఘనంగా మానసిక ఆరోగ్య వారోత్సవాలు

విశాలాంధ్ర - కొత్తూరు : ఈ నెల 10వ తేదీన మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వారం రోజులు మానసిక ఆరోగ్య వారోత్సవాలు ఘనంగా మండలం లోని కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గొర్లె తిరుమల రావు గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థుల యొక్క ఆహారపు అలవాట్లు వారి యొక్క మానసిక ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో తెలిపారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ప్రశాంత్ కుమార్ మీటింగ్ ద్వారా విద్యార్థులకు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ సిబ్బంది మరియు పాఠశాల విద్యర్థులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు టెక్కలి గిరిజన పాఠశాల విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - టెక్కలి : శ్రీకాకుళంలో జరుగుతున్న ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సిద్ధిపాలెం కుమారస్వామి హై జంప్ మరియు 100 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిహెచ్ నందేశ్వర రావు మరియు పిఈటి రమణయ్య తెలిపారు. వీరు రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపిక అవడం పట్ల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఏపీఓ చిన బాబు, డిడి అన్నదొర, డిప్యూటీ ఈవో గున్న రామ్మోహన్, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్చార్జి జాకబ్ దయానందం మరియు టెక్కలి ప్రభుత్వ గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాల సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచాలని ఐటీడీఏ పిఓ అభినందిచారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

విశాలాంధ్ర - కవిటి : ఒకే దేశం, ఒకే మార్కెటు, ఒకే పన్నులో భాగంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై సెమినర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని వలన ప్రజలకు ఖర్చు తగ్గి, పొదుపు పెరుగుతుందని అన్నారు. సామాన్యులు వినియోగించే నిత్యావసరాల ధరలు తగ్గడంతో పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. అలాగే విద్యార్థులు వినియోగించే పుస్తకాలు, పెన్నులు మొదలగు వాటి ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జె.పాపారావు, అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీను బాబు, కె. కరుణ శ్రీ, డి రమేష్, ఎల్.ఆనంద్, జనార్ధనరావు, బి. అంజన, విద్యార్థులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ సభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మందస : మందస మండలం గంగువాడలో ఈ నెల 8న, బూర్జ మండలం మసానపుట్టిలో ఈ నెల 9న జరిగబోయే బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభలను విజయవంతం చేయాలని కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు, వెన్నెలవలస థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, కార్యదర్శి సమర సింహాచలం ఉమ్మడిగా పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నుండి నంద్యాల జిల్లా వరకు పాదయాత్రను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా నుండి ఈ నెల 8న ప్రారంభమై నంద్యాల జిల్లా వరకు కొనసాగుతుందని ఆ తర్వాత గన్నవరం దగ్గర ముగుస్తుందన్నారు. ఈ నెల 28న విజయవాడలో ముగింపు సభ ఉంటుందని శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభమవుతున్న ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని, జిల్లాలోని వామపక్ష పార్టీలు, అన్ని ప్రజాసంఘాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వారు కోరారు. 8న మందస మండలంలోని యం.గంగువాడలో ఉదయం 10గంటలకు , 9న బూర్జ మండలం మసానపుట్టిలో ఉదయం 10గంటలకు బహిరంగ సభలు ఉంటాయని, ఈ రెండు సభల్లో ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న పాదయాత్రకు చైర్మన్ గా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి, రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కన్వీనర్ గా బాధ్యత వహిస్తున్న మహాదేవతో పాటు రాష్ట్ర స్థాయి ఉద్యమ సంస్థల నాయకులు, జిల్లాలోని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయటానికి అయా ప్రాంతాల బాధిత గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని రెండు పోరాట కమిటీల నాయకులు పిలుపునిచ్చారు.

చిన్నారుల ఆలోచన గొప్పది : లయన్ డా. పైడి సింధూర

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : చిన్నారులు కామేశ్వరి లక్ష్మిదీక్షిత, వీక్షితలు జన్మదిన వేడుకలను, నిరాశ్రయుల మధ్య జరుపుకోవటం స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు లయన్ డా.పైడి.సింధూర అన్నారు. పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థ నైట్ షెల్టర్ ఆవరణలో, శ్రీకాకుళం న్యూ కోలనీలో నివాసముంటున్న పురోహితులు విశ్వనాథ సంతోష్ కుమార్, బాల గాయత్రిల కుమార్తెలు జన్మదినం సందర్భంగా అన్నప్రసాదాన్ని అందించారు. అతిథిగా పాల్గొన్న డా.పైడి సింధూర నైట్ షెల్టర్ లో అన్నప్రసాదాన్ని అందించి మాట్లాడుతూ వేడుకలకు అధిక ధనాన్ని వృధా చేయటం కన్నా, పది మంది ఆకలి తీర్చటంలో ఆత్మసంతృప్తి కలుగుతుందని, ఈ వేడుకలను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలలో ముఖ్య స్థంభం అన్నవితరణ అని, ఆహారం అంధక ఆకలితో ఎవరూ ఉండకూడదనే ముఖ్య ఉద్దేశమన్నారు. నెలలో సుమారు పదిహేను రోజులు హంగర్ ఫీడింగ్ కార్యక్రమాలని చేస్తున్నామని, నిరంతరం ఈ సేవను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది. ఉమా శంకర్, లయన్ పొడుగు చరణ్, నేటి దాతలు విశ్వనాథ సంతోష్ కుమార్, బాల గాయత్రిలకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. అనంతరం పలు ముఖ్య కూడలిలో అభాగ్యులకు ఆహారాన్ని, లయన్స్ సేవకులు అందించారని ఈ సందర్భంగా తెలిపారు.

కమర్షియల్ గ్యాస్ వాడేలా చూడాలి

ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించిన ఏపీఎన్పీఎస్ నాయకులు

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో ఉన్న హాస్టల్స్ లో మరియు రెస్టారెంట్స్, దుకాణాలలో కమర్షియల్ గ్యాస్ వాడేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి (ఏపిఎన్పిఎస్) నాయకులు ఆర్డీఓ కు కోరారు. సోమవారం ప్రజా ఫిర్యాదులో ఆర్డీఓ ఎం కృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తలసముద్రం సూర్యం మాట్లాడుతూ రెస్టారెంట్లు, దుకాణాల్లో, హాస్టల్లో తప్పనిసరిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివలన ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, పెద్ద పెద్ద దుకాణాలలో డొమెస్టిక్ వాడుతున్నారని తెలిపారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి సంబంధిత రెస్టారెంట్లు, హాస్టల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బసవల గోవిందరావు, కానీ జగ్గారావు, అక్కురాడా అప్పన్న, బసవల్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్లు న్యాయం కోసం పోరాటం

చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సివిల్ అసిస్టెంట్ సర్జన్ లు విజయవాడలో జరిగే చలో విజయవాడ మూడవరోజు నిరసన కార్యక్రమంలో ఆదివారం కూడా పాల్గొన్నారు. ఈ నిరాహార దీక్ష ద్వారా మా హక్కుల కోసం పోరాడు తున్నామని సివిల్ అసిస్టెంట్ సర్జన్లు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని త్వరలోనే సానుకూలమైన నిర్ణయం వస్తుందనే నమ్మకం మాకు ఉందనీ వారు అన్నారు.గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పీహెచ్సీ వైద్యులు కోవిడ్ కాలంలో ప్రజల ప్రాణాల కోసం పోరాడారని గుర్తు చేశారు. ప్రభుత్వం సివిల్ అసిస్టెంట్ సర్జన్లు మనోభావాలను అర్థం చేసుకుని,తగిన న్యాయం చేస్తుందనే ఆశతో ఉన్నామని అన్నారు.ఈ న్యాయ పోరాటం విజయవంతమై మంచి వార్తతోనే తిరిగి వస్తామనీ నమ్మకముందని అన్నారు.అలాగే వైద్యుల జీవితాలను ప్రజల సేవలో గడుపుతాం అని దూర ప్రాంత గ్రామాలలో పొడవైన రాత్రులలో, ఎలాంటి సెలవులు లేకుండా, సౌకర్యాలు లేకుండా పని విధులు చేపడుతున్నామని తెలిపారు. అయినా నేడు ప్రాథమిక హక్కులుగా లభించాల్సిన వాటి కోసం విజయవాడలో నిరాహార దీక్షపై కూర్చోవలసిన వస్తోందని అనుకోలేదని అన్నారు.ఇది ప్రయోజనాల కోసం చేసే ఉద్యమం కాదని న్యాయం కోసం చేసే ఆర్తనాదం అని అన్నారు.మా డిమాండ్లు ప్రత్యేక హక్కులుకావని మేము ఏళ్ల తరబడి చేసిన సేవ మరియు త్యాగాల ద్వారా సాధించిన హక్కులని తెలిపారు.

మానవాళికి ఆదర్శం వాల్మీకి జీవితం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మహర్షి వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శమని భగవద్గీత ప్రచారకర్త సనపల కరుణ కుమార్ అన్నారు. సోమవారం మండలం లోగల ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో ఆయన గ్రామస్థులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం వేటగాడుగా ఉన్న వాల్మీకి దొంగగా మారి దారి దోపిడీలు చేశారని, ఆ తర్వాత నారద మహాముని దివ్యోపదేశంతో కొన్ని సంవత్సరాలుగా ధ్యానంలో ఉన్నారన్నారు. ఆ తర్వాత రామాయణ కావ్యాన్ని రచించారని ఆయన తెలిపారు. మనిషిలో మార్పు వస్తే మహర్షి కాగలరని నిరూపించింది వాల్మీకి మహర్షియని ఆయన గుర్తుచేశారు. వాల్మీకి మహర్షి జీవితం మానవులకు ఆదర్శప్రాయమని, ఆయన జీవితాన్ని ముందు తరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, సనపల రవణమ్మ, కె.సత్యన్నారాయణ, హనుమంతు మాధవరావు, సనపల విష్ణుమూర్తి, నేతింటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం దుర్మార్గపు చర్య

అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్పై దాడి యత్నాన్ని అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను తీవ్రంగా ఖండించారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి సీజెఐపైకి బూటు విసరడానికి ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమైన, అప్రజాస్వామ్యమైన చర్యగా పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ ఆయన ఒక సోమవారం ప్రకటన విడుదల చేశారు. సీజెఐపై దాడి యత్నం అంటే ఒక వ్యక్తిపై దాడి కాదనీ, అది భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ గౌరవం, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేసినట్లే," అని తైక్వాండో శ్రీను అన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సుప్రీం కోర్టు ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.